# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 | సంచిక : 288 | గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988

vntelugudaily@gmail.com





# రైతు భరోసా లేనట్టేనా?

యాసంగి సాగు మధ్య దశలోకి వచ్చినా అందని పెట్టుబడి సాయం

నిరాశ చెందుతున్న రైతులు

ప్రస్తుత యాసంగి సీజన్ పంటల సాగు మధ్య దశకు చేరుకున్నా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడకపోవడంపై రైతులు నిరాశ

## పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదల ఆలస్యం



హైదరాబాద్

అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా అందిస్తోంది. అయితే, ప్రస్తుత యాసంగి సీజన్ పంటల సాగు మధ్య దశకు చేరుకున్నా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడకపోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో భరోసాపై నిర్ణయం తీసుకుంటారని రైతులు భావించారు. అయితే పెట్టుబడిసాయం విడుదలపై ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఈసారి రైతు భరోసా లేనట్లేనా అనే సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

**షెడ్యూల్ దాటినా..**

గడిచిన వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 2,98,472 మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.326.03 కోట్లు జమ చేశారు. యాసంగి సీజన్ కోసం షెడ్యూల్ ప్రకారం గతేడాది డిసెంబర్‌లోనే రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6వేల చొప్పున సాయం సొమ్ము జమ చేయాల్సి ఉంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదల ఆలస్యమైందని రైతులు భావించారు. ఎన్నికల తంతు ముగియడంతో పెట్టుబడి సాయం వస్తుందని నిరీక్షించినా నిరాశే మిగిలిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతు భరోసాకు నిధులు విడుదల చేస్తే ఊరట లభిస్తుందని అంటున్నారు.



# రైతుబంధుకు ఎగనామం

- రైతన్నల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ : హరీష్‌రావు
- ఓట్ల కోసం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యతలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి
- పాలకుల విలాసాలకు, బడా కాంట్రాక్టర్ల కమీషన్లకు ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు
- ఎన్నికల ముందు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని రైతులను నిలువునా మోసం చేసి, ఇప్పటికే రెండు సీజన్ల రైతుబంధుకు ఎగనామం పెట్టారు

## పింఛన్ల పెంపు, మహిళలకు సాయం..

# డేట్ ఫిక్స్?

- 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి
- మార్చి 20వ తేదీన ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు
- ఈ బడ్జెట్‌లో మూడు కీలక పథకాలకు భారీగా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం
- మహిళా సాధికారత లక్ష్యంగా ప్రతి అర్హులైన మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకంపై ప్రభుత్వం తుది కసరత్తు
- ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించే కొత్త స్కీమ్‌ను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టనుంది



హైదరాబాద్


రాష్ట్రంలోని లబ్ధిదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వృద్ధాప్య పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకం (నగదు సాయం) మరియు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేందుకు సిద్ధమైంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో వీటికి నిధులు కేటాయించి, అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. నిధుల అందుబాటుపై ఆర్థిక శాఖ ఇప్పటికే సీఎంకు నివేదించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీన ఉపముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క - మిగతా3లో



## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి కానీ

- ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్
- ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉండటంపై క్షమాపణలు చెప్పిన బిల్‌గేట్స్
- ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టీకరణ

2



## ఎన్నికల కోసం లగ్జరీ ప్రచార వాహనాలు

- రోల్స్ రాయిస్ తరహా ఫీచర్లు
- ధర రూ.కోట్లకు పైనే!
- కోయంబత్తూరులో అత్యాధునిక ఎన్నికల ప్రచార వాహనాలు తయారీ
- అందులో కంప్యూటర్లు, ఎల్ఈడీ స్క్రీన్లు
- రోల్స్ రాయిస్ తరహా ఫీచర్లు!

2



## ఇళ్లంతా నోట్ల కట్టలే!

- ప్రభుత్వ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- చరిత్రలో ఇదే తొలిసారి!
- ఒడిశాలో బయటపడ్డ మరో అధికారి బాగోతం
- గనుల శాఖ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- దేబబ్రత మహంతిని అరెస్టు చేసిన పోలీసులు
- భువనేశ్వర్‌లో రెండంతస్తుల భవనంలో 130 గ్రా.బంగారం గుర్తింప

## 'పాత నేతలు శాశ్వతంగా ఉండలేరు



- కొత్త తరాన్ని ఆహ్వానించాల్సిందే'
- డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు
- కర్ణాటక ఉపముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- కొత్త ఎమ్మెల్యేల డిమాండ్‌కు పూర్తి మద్దతు

## ఇల్లంతా నోట్ల కట్టలే!




ఒడిశాలో ఓ చిన్న లంచం కేసు దర్యాప్తు భారీ అవినీతి కుంభకోణాన్ని బయటపెట్టింది. రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రభుత్వ అధికారి ఇంట్లో కోట్ల రూపాయల నగదు లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు పరిమాణం చూసి వారు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దేబబ్రత మహంతి అవినీతి ఆరోపణలపై అరెస్టయ్యాడు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు వ్యాపారి నుంచి డిపో నిర్వహణ, రవాణా అనుమతుల కోసం రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందడంతో ఒడిశా విజిలెన్స్ డైరెక్టరేట్ అధికారులు ఉచ్చు వేశారు. మంగళవారం రాత్రి లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు అనంతరం కేసు నమోదు చేసి, బుధవారం ఉదయం నుంచి మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. భువనేశ్వర్?లోని ఆయన నివాస ఫ్లాట్, భద్రక్ జిల్లాలోని స్వగ్రామ ఇల్లు, అలాగే కటక్‌లోని కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో బయటపడిన నగదు చూసి అధికారులు షాక్‌కు గురయ్యారు. భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ట్రాలీ బ్యాగులు, అల్మారాలు, డ్రాయర్లలో దాచిపెట్టిన నగదును లెక్కించగా రూ.4 కోట్లకు పైగా ఉన్నట్లు గుర్తించారు. లెక్కల్లో చూపించని ఈ మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. అదనంగా ఆయన కార్యాలయంలోని టేబుల్ డ్రాయర్‌లో మరో రూ.1.20 లక్షల నగదు కూడా పట్టుబడింది. ఇదే కాకుండా మహంతికి చెందిన మరిన్ని ఆస్తులు కూడా వెలుగులోకి వచ్చాయి. భువనేశ్వర్ సమీపంలోని పహాలా ప్రాంతంలో సుమారు 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండంతస్తుల భవనం, దాదాపు 130 గ్రాముల బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించారు. ఇవన్నీ ఆయన అధికారిక ఆదాయానికి మించి ఉన్నాయని అనుమానిస్తున్నారు. స్థిర, చరాస్తుల పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు చెబుతున్న ప్రకారం, ఒడిశా చరిత్రలో ఒకే అధికారి ఇంటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం కావడం ఇదే తొలిసారి. గతంలో కూడా పలువురు అధికారులపై సోదాలు జరిగి కోట్లు బయటపడినప్పటికీ, ఈ స్థాయి నగదు ఎప్పుడూ దొరకలేదని పేర్కొన్నారు.

మహంతి ఉద్యోగ ప్రస్థానం కూడా పరిశీలనలోకి వచ్చింది. 2004లో జూనియర్ మైనింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సేవలో చేరిన ఆయన బాలంగీర్, బారిపద, బెర్హంపూర్, కటక్, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. తరువాత ప్రమోషన్లు పొందుతూ ఇటీవలే కటక్ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే కొద్ది కాలంలోనే అవినీతి ఆరోపణలతో చిక్కుకోవడం సంచలనంగా మారింది. భువనేశ్వర్ విజిలెన్స్ విభాగం ఎస్పీ సరోజ్ కుమార్ సామల్ మీడియాతో మాట్లాడుతూ, మహంతిని స్పెషల్ విజిలెన్స్ కోర్టులో హాజరుపరుస్తామని, అతని ఆస్తులపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. రూ.30 వేల లంచం కేసుతో మొదలైన ఈ దర్యాప్తు కోట్ల రూపాయల అక్రమ సంపాదనను బయటపెట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఎంతగా వేర్లు వేసిందనే ప్రశ్న మళ్లీ ముందుకు వచ్చింది. విజిలెన్స్ శాఖ చర్యలతో ఇతర అవినీతి అధికారులకు ఇది గట్టి హెచ్చరికగా మారింది.

## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి కానీ

సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో తన పేరు ఉండటంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ స్పందించారు. ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు ఉన్నాయని, కానీ ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టం చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్స్‌తో తనకు సంబంధం ఉండటంపై బిల్ గేట్స్ తన గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. తాను చట్టవిరుద్ధంగా ఏ పని చేయలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆయన అంగీకరించడం గమనార్హం. నేరాల్లో మాత్రం భాగస్వామ్యం లేదని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో ఈ అంశాలను పేర్కొన్నారు. ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు, అతని సమావేశాలలో గేట్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొనడం తాను చేసిన తప్పు అని అంగీకరించారు. ఎప్‌స్టీన్ నేరాలు తమ ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు వ్యతిరేకమని తెలిపారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తమ ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

## 8వ తరగతిలో వివాదాస్పద పాఠం.. స్పందించిన కేంద్ర ప్రభుత్వం




'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ 8వ తరగతి సోషల్ పుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఇలాంటి పాఠ్యాంశాన్ని పాఠ్య పుస్తకంలో చేర్చడం వివాదానికి దారితీసింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను తాము సహించబోమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. వివాదాస్పదమైన ఆ పాఠ్యాంశాన్ని తొలగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. అలాంటి అంశాలను చేర్చకుండా ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తంచేశాయి. అవి ఆమోదయోగ్యమైనవి కావని, వాటి స్థానంలో స్ఫూర్తిదాయక అంశాలు చేర్చాల్సిందని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎన్సీఈఆర్టీ 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావడంతో.. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ పాఠ్యాంశాన్ని తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# 'పాత నేతలు శాశ్వతంగా ఉండలేరు

కర్ణాటక మంత్రివర్గంలోకి కొత్త రక్తానికి అవకాశం కల్పించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. పాత తరం నాయకులు ఎప్పటికీ కొనసాగలేరని, పార్టీ భవిష్యత్తు కోసం తాజా ఆలోచనలు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో పాల్గొన్న శివకుమార్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు కేబినేట్?లో స్థానం కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలిపారు. తన కేబినేట్ సహచరుడు హెచ్‌సీ మహాదేవప్ప చేసిన దళిత ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని శివకుమార్ తెలిపారు. మహాదేవప్ప చేసిన వ్యాఖ్యలను వినినట్లు చెప్పారు. ఆయన హైకమాండ్‌కు దగ్గరగా ఉంటారని, మార్పునకు సంబంధించి మంత్రి మహదేవప్ప వద్ద సమాచారం ఉండి ఉంటుందని తెలిపారు. అందుకే దళిత నాయకుడు ముఖ్యమంత్రి కావాలని వ్యాఖ్యలు చేసి ఉంటారని అన్నారు. కానీ తన దగ్గర మాత్రం ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మంత్రుల వ్యాఖ్యలపై నిశ్శబ్దంగా ఉన్నారన్న విమర్శలపై శివకుమార్ స్పందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలను నియంత్రించాల్సింది ముఖ్యమంత్రే అని తెలిపారు. పార్టీకి సంబంధించిన విషయాలను తాను ఎప్పటికప్పుడు అధిష్ఠానంతో చర్చిస్తూ వస్తున్నానని తెలిపారు.

**దిల్లీకి వెళ్తా- అందులో కొత్త ఏం లేదు : డీకే**

తనను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను దిల్లీకి పిలిచారనే



వార్తలపై స్పందిస్తూ, తనకు ఎలాంటి కాల్స్? రాలేదని స్పష్టం చేశారు. తన శాఖకు సంబంధించిన పనుల కోసం దిల్లీకి వెళ్లాల్సి ఉందని శివకుమార్ తెలిపారు. మంత్రి సతీశ్ జార్ఖిహొళి సీనియరు నాయకుడని, తనతో కలిసి కార్యాధ్యక్షునిగా సేవలు అందించారని పేర్కొన్నారు. వారానికి ఒకసారైనా తామిద్దరం మాట్లాడుకుంటామన్నారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే మా నాయకులందరి ఏకైక అజెండా అని చెప్పారు. "నేను దిల్లీకి వెళ్తాను. దాని గురించి కొత్తగా ఏదైనా ఉందా? నేను ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. నేను అనేక విద్యా సంస్థలను నిర్వహిస్తున్నా. ఆ విషయాలకు సంబంధించి నేను దిల్లీకి వెళ్తున్నా. హైకమాండ్ నాయకులను కూడా కలుస్తాను. అలాగే రాహుల్ గాంధీ, సోనియా గాంధీను కూడా కలుస్తా. ఇక మల్లికార్జున ఖర్గే ఇక్కడ బెంగళూరులో ఉంటారు. నేను ఆయనను ఇక్కడ కలుస్తాను' అని డీకే తెలిపారు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో, తమకూ అవకాశం కల్పించాలని కోరుతూ తొలిసారి ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం సిద్ధరామయ్య, శివకుమార్ సహా పార్టీ అధిష్ఠానానికి లేఖ రాశారు. ఈసారి 38 మందిని కొత్తగా అసెంబ్లీకి పంపడం ద్వారా ప్రజలు యువ నాయకత్వం కోరుకుంటున్నారని, ఆ మేరకు కనీసం నూతనంగా ఎన్నికైన ఐదుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. కొత్త ఎమ్మెల్యేల డిమాండ్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన శివకుమార్ కేబినెట్‌లోకి కొత్త తరాన్ని ఆహ్వానించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

**ఐదేళ్లూ నేనే సీఎంగా ఉంటా!**

గతేడాది, నవంబర్? 20తో కర్ణాటకలోని కాంగ్రెస్? ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తి చేసుకుంది. దీంతో ముఖ్యమంత్రి పదవీపై గత కొద్దిరోజులుగా టాక్? నడుస్తోంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్?లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, ఈ ఊహాగానాలను సిద్ధరామయ్య ఖండించారు. ఐదేళ్లూ తానే సీఎంగా ఉంటానని పలుమార్లు స్పష్టం చేశారు. అదే సమయంలో డీకే కూడా ఈ విషయంపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని అనేక సార్లు చెప్పారు.

# ఎన్నికల కోసం లగ్జరీ ప్రచార వాహనాలు

తమిళనాడులో అప్పుడే ఎన్నికల వేడి మొదలైంది. రాజకీయ పార్టీలు తమ ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఈసారి లగ్జరీ లుక్స్?తో అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ప్రచార వాహనాలను సిద్ధం చేయిస్తున్నాయి. అందులో కంప్యూటర్లు, స్మార్ట్? ఎల్?ఈడీలు, రోల్స్? రాయిస్? కారులోని పుష్? క్యాబిన్? తరహా ఇంటీరియర్?ను ఏర్పాటు చేస్తున్నారు. ఏంటీ ఆశ్చర్యంగా ఉందా? అయితే ఈ పూర్తి కథనం చదవండి.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఓ వైపు పొత్తులు, సీట్ల సర్దుబాటు చర్చలు చూస్తూనే, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గోడలపై ఆయా పార్టీలు చిహ్నాలు దర్శనమిస్తున్నాయి. ఏప్రిల్?లో ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో, రాజకీయ పార్టీలు ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు ముమ్మరంగా ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నాయి.

**లగ్జరీ ప్రచార వాహనాల కోసం ఆర్డర్స్**

అందుకే పలు రాజకీయ పార్టీలు కోయంబత్తూరులోని శివానంద కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థకు భారీగా ఆర్డర్లు ఇస్తున్నాయి. తమ నాయకుల కోసం ప్రత్యేకంగా అత్యంత విలాసవంతమైన ప్రచార రథాలను తయారు చేయమని అడుగుతున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్?లకు చెందిన నాయకుల కోసం ఎన్నికల ప్రచార వాహనాలు డిజైన్ చేసిన అనుభవం ఈ ప్రైవేట్ సంస్థకు ఉంది. క్రమంగా ఇది రాజకీయ నాయకుల కోసం క్యాంపెయిన్? వెహికల్స్? తయారుచేసే అగ్రగామి సంస్థగా ఎదిగింది. అందుకే ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు తమ కోసం అత్యాధునిక సౌకర్యాలున్న వ్యాన్?ల కోసం ఆ సంస్థను ఆశ్రయిస్తున్నాయి. "గతంలో రాజకీయ నాయకులు తమ ఎన్నికల ప్రచారం కోసం ఎక్కువగా 'టెంపో ట్రావెలర్ల'ను ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు మార్కెట్లోకి 'ఫోర్స్? అర్బానియా' వ్యాన్?లు వచ్చేశాయి. ఇవి చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. అందుకే వారి అవసరాలకు అనుగుణంగా వీటిని అప్‌గ్రేడ్ చేస్తున్నాం. మేము రీమోలింగ్ చేసిన వాహనాలను పరిశీలిస్తే, అందులో అత్యాధునిక సాంకేతికతతో, లగ్జరీ ఫిట్టింగ్‌లతో అద్భుతంగా ఉంటుంది." రియాస్, ఎన్నికల ప్రచార వాహనాలను రీమోడలింగ్ చేసే ప్రైవేటు సంస్థ యజమాని

**డిజైన్ చేశారిలా!**

"రాజకీయ నాయకులు ఎన్నికల కోసం దీర్ఘకాలంపాటు ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. అందుకే వారికి సౌకర్యవంతంగా ఉండేందుకు, ఫోర్స్? అర్బానియాను



రీడిజైన్ చేశాం. అందులో నేతలు కూర్చునేందుకు 'స్వివెల్? మెకానిజం'తో కూడిన సీట్లు అమర్చాం. దీని వల్ల వారు సౌకర్యవంతంగా కూర్చొని ప్రసంగించవచ్చు. అంతేకాదు వాహనంలోనే సులభంగా అటూఇటూ కదలవచ్చు. ఇక బహిరంగ సభల కోసం ఈ వ్యాన్లలో హైడ్రాలిక్?/ మాన్యువల్ లిఫ్ట్? సిస్టమ్?తో కూడిన స్టేజ్? ఏర్పాటు చేశాం. లిఫ్ట్ ఇష్టం లేనివారు కదిలే మెట్లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ఫీచర్స్ వల్ల నేతలు ఎత్తైన వేదికపై నుంచి నేరుగా ప్రజలతో మాట్లాడే అవకాశం ఏర్పడుతుంది. ఇక నేతల సుదీర్ఘ ప్రచారయాత్రలను దృష్టిలో ఉంచుకుని, వాహనంలో విశ్రాంతి తీసుకోవడానికి బెర్త్?లు ఏర్పాటు చేశాం. పార్టీ కార్యకర్తలతో, ముఖ్యులతో సమావేశం నిర్వహించడానికి సోఫా సెట్లు కూడా పొందుపరిచాం. అంతేకాదు ఈ ప్రచార వాహనాల్లో ప్రత్యేకమైన లైటింగ్ సిస్టమ్ పెట్టాం. దీని వల్ల నాయకులు వాహనం లోపల ఉన్నప్పటికీ, బయట ఉన్న కార్యకర్తలు వారిని స్పష్టంగా చూడవచ్చు. అలాగే నాయకులు ఇచ్చే ప్రసంగాలు ప్రజలందరికీ స్పష్టంగా వినిపించేలా దీనిలో అత్యాధునిక ఆడియో సిస్టమ్?లను ఏర్పాటు చేశాం. నేతల వెంట వచ్చే భద్రతా సిబ్బంది కోసం వాహన బయట హ్యాండ్?రైల్స్?, మెట్లు పెట్టాం. దీని వల్ల సుమారు 15 మంది సిబ్బంది ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించవచ్చు" అని రియాస్ పేర్కొన్నారు.

**అడ్వాన్స్‌డ్ ఫీచర్స్**

గత ఎన్నికల్లో వాడిన ప్రచార వాహనాల కంటే, ఈసారి తయారు చేస్తున్న వాహనాల్లో అత్యాధునిక ఫీచర్లను పొందుపరిచినట్లు రియాస్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రచార రథాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, 24 గంటల ఇంటర్నెట్ సౌకర్యం, రెండు స్మార్ట్? ఎల్?ఈడీ టీవీలు, బయటివైపు ఒక పెద్ద ఎల్?ఈడీ డిస్?ప్లే స్క్రీన్?, ప్రచార కార్యక్రమాలను రికార్డ్ చేయడానికి కెమెరాలు అమర్చినట్లు తెలిపారు.

"ఇక లగ్జరీల విషయానికి వస్తే, టచ్? సెన్సార్స్?తో పనిచేసే రెక్లైనర్ సీట్లు, రోల్స్ రాయిస్? కార్ల తరహాలో ప్రీమియం యాంబియెంట్? సీలింగ్ లైటింగ్, అధునాతన గ్రీన్? రెస్ట్?రూమ్? సౌకర్యాలు ఉంటాయి. అయితే ఈ హై-ఎండ్? ప్రచార వాహనాల తయారీకి అయ్యే ఖర్చు, వాటిలో పొందుపరిచే ఫీచర్లు, స్పెసిఫికేషన్లను బట్టి సుమారు రూ.7 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఉంటుంది. వివిధ రాజకీయ పార్టీలు నుంచి, ముఖ్యంగా చెన్నై నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. జనవరి నెలలోనే మేము 7 వాహనాలను డెలివరీ చేశాం. మరికొన్ని తయారీ దశలో ఉన్నాయి." అని రియాస్ చెప్పారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో ఈ తరహా వాహనాలకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు.

## ముంబైలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

# దిగజారిన గాలి నాణ్యత

దేశ రాజధాని ఢిల్లీతో పోటీపడుతూ వాణిజ్య రాజధాని ముంబైలో కూడా వాయుకాలుష్యం పెరిగిపోతోంది. రోజూ గాలి నాణ్యత పడిపోతోంది. ఈ విషయాన్ని తాజా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) నివేదిక తేల్చింది. ఇటీవల ఏక్యూఐ ఏకంగా కొన్నిచోట్ల 300 పాయింట్లు దాటింది. సాధారణంగా 50 లోపు ఉంటే ఆరోగ్యం. 51-100 వరకు ఉంటే ఫర్వాలేదు. కానీ, 100 దాటితే ఆందోళనకరం. అలాంటిది ముంబైలో ఏక్యూఐ వారం రోజులుగా 100 పైనే నమోదవుతోంది. ఈ నెల 17న 123, 18న 78, 19న 153, 20న 318, 21న 259, 22న 240, 23న 190, 24న 250 పాయింట్లుగా నమోదైంది. ఈ తరహాలో వాయు కాలుష్యం శీతాకాలంలో, ఢిల్లీలో నమోదవుతుంటుంది. అయితే, ఇప్పుడు ఇది ముంబైలోనూ మొదలవ్వడం ఆందోళనకరం. సాధారణంగా ముంబైలో చేపల వాసన, సముద్ర నీటి నుంచి వచ్చే ఉప్పు గాలి వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. కానీ, ఇప్పుడు అక్కడి ప్రజలు వాయు




కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం, సిటీలో చెత్తను తగలబెట్టడం ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే నిర్మాణ రంగం నుంచి వచ్చే సన్నని ఇసుక, రోడ్లపై నుంచి లేచే మట్టి వంటివి కూడా వాయుకాలుష్యానికి కారణాలు. ముంబైలో బిల్డింగుల కూల్చివేతలు, కొత్తవి నిర్మించడాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. వీటికి సంబంధించి సిమెంట్, ఇసుక వంటి వ్యర్థాలు గాలిలో ఎక్కువగా కలిసిపోతున్నాయి. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, వాహనాల కాలుష్యం వంటివి కూడా ముంబైలో గాలి నాణ్యత తగ్గడానికి కారణాలు. ఇక ముంబైలో కాలుష్యం పెరగడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక బీఎంసీ, ఎన్ఎంఎంసీ అధికారులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ విషయంలో విఫలమైతే బీఎంసీ, ఎన్ఎంఎంసీ కమిషనర్లకు వేతనాలు ఆపాలని కూడా సూచించింది. వాయు కాలుష్యం ఇంతలా పెరిగిపోతున్నా అరికట్టడంలో విఫలమవుతున్న స్థానిక నాయకత్వం, ప్రభుత్వంపై అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఫోటో కొట్టండి.. గిఫ్ట్ పట్టండి




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తున్నారా. అయితే అది మీ కంట పడిందా.. మీకు ఒక గుడ్‌న్యూస్. ఎందుకంటే తాగు నీరు వేస్ట్ చేసే వారి పట్ల జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా ఝుళిపించనున్నారు. నీటిని వృథా చేసే వారికి సంబంధించిన ఫోటోలను క్లిక్ మనిపించి.. ఆ ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. వారికి రూ.200 బహుమతి ఇవ్వనున్నారు. వచ్చేది వేసవి కావడంతో నీటి కొరత లేకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్తలు చేపడుతున్నారు.ఎండాకాలం వచ్చిందంటే చాలు హైదరాబాద్ మహా నగరంలో తాగు నీటి కొరత ఏర్పడుతుంది. ఇళ్లల్లో ఉండే బోర్లు ఎండిపోయి.. తాగడానికి, కడుక్కోడానికి కూడా నీరు లేక నగరవాసులు అవస్థలు పడుతున్న సంఘటనలు గత కొన్నేళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఇక వేసవిలో వాటర్ ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో భారీగా డబ్బులు ఖర్చు పెట్టినా వాటర్ ట్యాంకర్ దొరుకుతుందనే నమ్మకం కూడా ఉండదు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వేసవి కాలం ప్రవేశించడంతో హైదరాబాద్ నగరంలో నీటి కటకట రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఎవరైనా తాగునీటిని వేస్ట్ చేస్తుంటే.. ఒక్క ఫోటో తీసి పంపిస్తే.. అలా ఫోటో పంపించిన వారికి రూ.200 గిఫ్ట్‌గా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకోసం పానీ యాప్‌ను వచ్చే నెల తొలి వారంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి.. ఆ ఫోటోలో ఉన్న లొకేషన్‌ను గుర్తించి.. వెంటనే వారిపై జరిమానాలు విధిస్తామని వెల్లడించారు. ఒకవేళ వారు ఫైన్ చెల్లించకపోతే.. వారు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే అందకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతామని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు.ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్ట్‌మెంట్, కాలనీలు.. ఇలా ఎక్కడైనా నగర పరిధిలో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తూ.. వాహనాలు కడుగుతుంటే.. మొబైల్‌తో ఒక్క ఫోటో తీసి.. తమకు పంపించాలని హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు నగరవాసులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పానీ యాప్‌ను.. మార్చి మొదటి వారంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆ ఫోటోను పానీ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వారికి.. రూ.200 బహుమతిగా ఇస్తామని అధికారులు ప్రకటించారు. నీటిని వృథా చేసిన వారికి.. రూ.1000 నుంచి రూ.5000 వరకూ ఫైన్ విధిస్తామని వాటర్ బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు.హైదరాబాద్ నగరంలోకి వందల కిలోమీటర్ల దూరం నుంచి.. జలాలను అధికారులు తీసుకువస్తున్నారు. అయితే ప్రతీ ఎండాకాలంలో ఒకవైపు నీరు లేక జనం అల్లాడిపోతుంటే.. మరికొందరు నగరవాసులు మాత్రం.. వాటిని భారీ ఎత్తున వృథా చేస్తున్నారు. ప్రభుత్వం ఒక కిలోలీటర్ నీటికి రూ.45 వరకు ఖర్చు చేస్తోంది. వాటిని ఇంటింటికీ నల్లా కనెక్షన్లకు నెలకు 20 కిలోలీటర్ల నీళ్లను ఫ్రీగా అందిస్తోంది. ఇక మరిన్ని అవసరాలకు రూ.10 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నీటిని వృథా చేయవద్దని అధికారులు.. నగరవాసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒకవైపు హైదరాబాద్ నగరవాసులకు నీటి సరఫరా చేయడం ఆర్థికంగా ప్రభుత్వానికి భారం అయినప్పటికీ.. ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. చాలా మంది మాత్రం ఇళ్లను, వాహనాలను కడుగుతూ తాగేనీటిని చాలా వృథా చేస్తుండడంపై వాటర్ బోర్డు అధికారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నీటి వృథాను అరికట్టేందుకు అధికారులతో తనిఖీలు చేపట్టడంతోపాటు.. నగరవాసులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించి.. ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఇటుక ధరలు ప్రియం...
# ట్రక్కు రూ.20వేలకు పైగా ధరలు



**ఖమ్మం :** ఇటుక ధరలు అకాశానంటుతున్నాయి.. ప్రజల అవసరాలను అసరాగా చేసుకున్న ఇటుక వ్యాపారులు ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు.. క్రీస్తు శకం.. క్రీస్తు పూర్వం అన్నట్లుగా ఇందిరమ్మ ఇళ్లు రాక ముందు... ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత అన్నట్లుగా బట్టీ వ్యాపారులు ధరలను కొండెక్కించారు. పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందనంత ఎత్తుకు ఆ ధరలు పెరిగిపోయాయి.. ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత ఇటుక ధరలు మూడు రెట్లు పెరిగినట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇండ్లు కట్టుకోవాలనుకునే నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు బెంబెలేత్తుతున్నారు. ప్రతి ఇళ్లు నిర్మాణం చేయాలంటే ఇటుక చాలా అవసరం.. అందులో ఎర్ర ఇటుక లేకుండా ఏ ఇళ్లు కట్టలేము.. ఆ ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేస్తేనే గట్టిదనం ఉంటుందని అందరు భావిస్తుంటారు. అయితే ఏ సైజు ఇళ్లు నిర్మాణం చేయాలన్న కనీసం 10వేల ఇటుక అవసరం అవుతుంది.. సింగిల్ బెడ్ రూమ్ కు సుమారు 10వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇంటికి 15వేల నుంచి 20వేల ఇటుక అవసరం. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ఎర్ర ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేయాలని భావిస్తారు. అందుకే ఇంటి నిర్మాణం చేసేవారు ముందుగా ఇటుక ను కొనుగోలు చేసేందుకు తొందరపడతారు. ఎర్ర ఇటుక ధరలు ఏడాదికేడాది అమాంతంగా పెరుగుతున్నాయి.. 2005 సంవత్సరంలో 2వేల ఇటుక ధర రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ధర పలికేది. 2010 తరువాత రూ.4వేల నుంచి రూ.5వేలకు పలికేది. 2015 నుంచి 2024 వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకముందు ట్రక్కు ఎర్ర ఇటుక రూ.5వేల నుంచి రూ.7వేల వరకు ధరలుండేవి. కానీ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం, గ్రామానికి 20 నుంచి 30 ఇండ్లను మంజూరు చేయడంతో లబ్ధిదారులందరికి ఇటుక అవసరమైంది.దీంతో లబ్ధిదారుల అవసరాన్ని అసరగా చేసుకున్న ఇటుక బట్టీల వ్యాపారులు ఇటుక ధరలను అమాంతంగా పెంచేశారు. 2024 డిసెంబర్ వరకు మంచి ఇటుక ట్రక్కు ఇటుక రూ.10వేలకు పెంచిన వ్యాపారులు, నెల వ్యవధిలోనే రూ.15వేలు, మరో నెలకు మరో రూ.5వేలను పెంచి ప్రస్తుతం 2వేల ఇటుక ధర రూ.20వేల నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. రెండవ రకం ఇటుక 2వేల ఇటుక రూ.16వేల నుంచి రూ.18వేల వరకు విక్రయాలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసే నిరుపేదలకు ఇటుక ధరలు భారమవుతున్నాయి. ఒకొక్క ఇందిరమ్మ ఇంటికి చిన్ని ఇంటికి సుమారుగా 10వేల ఇటుక, కొంచె పెద్ద ఇంటికి 15వేల ఇటుక అవసరం అవుతుంది. దీంతో ఇటుకకే రూ.1,50,000 నుంచి రూ రూ.1,80,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.. దీంతో నిరుపేదలకు ఇటుక అధిక ధరలు తీవ్రంగా భారమవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగానే సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలను అమాంతంగా పెంచారని భావించి తక్షణమే ధరల నియంత్రణపై ఉపమంత్రివర్గాన్ని నియమించింది. రోజుల వ్యవధిలోనే ధరలను నియంత్రించింది. దీంతో సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలు అదుపులోకి వచ్చాయి.కానీ ఇటుక ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయే తప్ప..ఇప్పటి వరకు అదుపులోకి రాలేదు. ఇటుక ధరలను పట్టించుకునే నాథుడే కరువైయ్యారు. అధికారులు ఇటుక బట్టీల వైపు చూసే నాథుడే లేడు. దీంతో ఇటుక వ్యాపారులు అధిక ధరల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.. ప్రజలకు మాత్రం జేబులకు చిల్లు పడుతోంది.. కూసుమంచి మండలంలోని కూసు మంచి, తుర్కగూడెం, జుజ్జులరావుపేట సమీప గ్రామాల్లో ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ ఇటుక బట్టీలలో ధరలు విఫరీతంగా పెరుగుతున్నాయి. సామా న్యులు కొనలేని పరిస్థితిలో ఇటుక ధరలను వ్యాపారులు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి అతి దగ్గరలో ఇటుక బట్టీలు ఉన్నప్పటికి సంబంధిత రెవెన్యూ, పర్యావరణ, పంచాయతీ రాజ్, చిల్డన్స్ వ్పెర్ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. కనీసం ధరల నియంత్రణ పై ద్రుష్టి సారించడం లేదు. దీంతో తీవ్ర స్థాయిలో విమ్మర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇటుక బట్టీలను తనిఖీ చేసి వ్యాపారులతో చర్చించి, ధరలను నియంత్రించాలని, నిరుపేదలకు సహాయం చేయాలని పలువురు కోరుతున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా..? ఇటుక బట్టీలను తనిఖీ చేస్తారా..? చూద్దాం..

# మల్లారెడ్డికి షాక్...



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతలు.. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిలకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలో ఉన్న వివాదాస్పద భూమికి సంబంధించిన సర్వే వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. సవాల్ చేస్తూ మాజీ మంత్రి మల్లారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి.. తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.ఇక ఆ వివాదంలో ఉన్న భూమి వ్యవహారంలో సర్వే ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. జీడిమెట్లలోని సర్వే నెంబర్ 82లో ఉన్న 2.22 ఎకరాల భూమికి సంబంధించి.. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను తాజా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సమర్థించింది.ఆ వివాదంలో ఉన్న భూమికి సంబంధించి.. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ నోటీసులు ఇవ్వకుండానే సర్వే నిర్వహించారని ఎమ్మెల్యే మల్లారెడ్డి గతంలోనే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ సర్వేపై స్టే ఇవ్వాలని హైకోర్టును ఆయన కోరగా.. కోర్టు మాత్రం స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా హైకోర్టు తీర్పునే సమర్థించడంతో మళ్లీ ఎదురుదెబ్బ తప్పలేదు.అయితే శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి.. తన భూమిని మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు కబ్జా చేశారంటూ ఆరోపించగా.. రెవెన్యూ అధికారులు గతేడాది డిసెంబర్ 9వ తేదీన అధికారికంగా భూ సర్వే చేపట్టారు. మేడ్చల్ జిల్లా సుచిత్ర సెంటర్‌లోని సర్వే నంబర్ 82, 83లో ఉన్న 1.29 ఎకరాల్లో.. 33 గుంటల భూమిని మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో కబ్జా చేశారని.. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు అధికారిక భూ సర్వే నిర్వహించారు. కానీ కోర్టులో తమకు అనుకూల తీర్పు వచ్చినా.. తమ భూమిని కాజేసే కుట్ర చేస్తున్నారని మల్లారెడ్డి అప్పుడు ఆరోపించారు. సర్వే సమయంలో అక్కడికి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి అనుచరులు భారీగా చేరుకోవడంతో.. పోలీసులు వారిని అడ్డుకున్నారు.

## రైతుబంధుకు ఎగనామం

**హైదరాబాద్ :** రైతుల కన్నీళ్లతో పునాదులు నిర్మించుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించినట్లు చరిత్రలో లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల ఉసురు పోసుకుంటోందని ట్విటర్‌లో ఆరోపించారు. ఓట్ల కోసం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యతలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. పాలకుల విలాసాలకు, బడా కాంట్రాక్టర్ల కమీషన్లకు ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 4న మిర్యాలగూడ బహిరంగ సభలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేస్తాం. ఇప్పటికే నిధులు సమకూర్చుకున్నామని ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలికారని పేర్కొన్నారు. పత్రికల్లో లీకులు ఇచ్చి అనుకూల వార్తలు రాయించుకున్నారని, తీరా ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు దాటుతున్నా రైతుబంధు ఊసే లేదని అన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లోనూ రైతు బంధుపై ఉలుకు లేదు, పలుకు లేదని వెల్లడించారు.

**రైతుబంధుకు ఎగనామం**

ఎన్నికల ముందు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని రైతులను నిలువునా మోసం చేసి, ఇప్పటికే రెండు సీజన్ల రైతుబంధుకు ఎగనామం పెట్టారని ఆరోపించారు. కేవలం ఓట్ల కోసమే రైతుబంధు పేరుతో నాటకాలు ఆడుతుందని అన్నారు. రైతులకు సకాలంలో రైతుబంధు ఇవ్వడానికి నిధులు లేవంటున్న రేవంత్ రెడ్డి , మూసీ సుందరీకరణకు వేల కోట్లు, సుందరీకరణలో భాగంగా కూల్చే ఇండ్లకు వేల కోట్లు పంచిపెట్టడానికి, మూసీలో పార్కులు కట్టడానికి వేలకోట్లు ఎక్కడినుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ పేరుతో భూసేకరణకు , రోడ్ల నిర్మాణానికి వేల కోట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు.

కమిషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు

ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే బడా కాంట్రాక్టర్లకు కమిషన్ల కోసం 25 వేల కోట్ల బిల్లులు చెల్లించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. ఢిల్లీ పెద్దలకు మూటలు పంపడానికి వేల కోట్లు ఉంటాయి కానీ, కష్టాల్లో ఉన్న రైతన్నకు రైతుబంధు ఇవ్వడానికి మాత్రం చేతులు రావా? అంటూ నిలదీశారు. ఒకవైపు ఇనుప కంచెలు లేని ప్రజా పాలన అని గొప్పలు చెప్తూనే.. ముఖ్యమంత్రి నివాసముంటున్న జూబ్లీహిల్స్ లో వందల కోట్లతో ప్యాలెస్ లాంటి క్యాంప్ కార్యాలయం కట్టుకుంటున్నారని విమర్శించారు. క్యాంప్ ఆఫీస్ చుట్టూ బలమైన ఇనుప కంచెల కోసమే 9 కోట్లు ఖర్చు చేస్తున్నారని దీనిని బట్టి మీ ఏడో గ్యారెంటీ ప్రజాస్వామిక పాలన ఎంత గొప్పగా వర్ధిల్లుతుందో అర్థమవుతోందని అన్నారు. ప్యాలెస్ పక్కనే రూ. 5 కోట్లతో ఫుట్ బాల్ ఆడుకోవడానికి ప్రత్యేకంగా కోర్టు కట్టుకుంటున్నారని, అందాల పోటీలకు, ఫుట్ బాల్ మ్యాచ్ లకు వందల కోట్లు ఖర్చు పెడుతూ, అన్నంపెట్టే రైతన్న నోట్లో మాత్రం మట్టి కొడుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న మోసపూరిత వైఖరిని, అన్నదాతలను పెడుతున్న తిప్పలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా పగటివేషాలు, ఓట్ల కోసం నాటకాలు కట్టిపెట్టి, రైతులందరికీ రైతుబంధు నిధులు విడుదల చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

## పింఛన్ల పెంపు, మహిళలకు సాయం.. డేట్ ఫిక్స్?

-మొదటిపేజీ తరువాయి

బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో పైన పేర్కొన్న మూడు కీలక పథకాలకు భారీగా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం

**ఆసరా పింఛన్ల పెంపు..!**

తెలంగాణలో ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు మరియు ఇతర కేటగిరీలకు ఇస్తున్న ఆసరా పింఛన్‌ను మేనిఫెస్టో హామీ ప్రకారం రూ. 4,000కు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం వీరికి ?2,016 అందుతుండగా, దీనిని రెట్టింపు చేయడం వల్ల సుమారు 44 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. దీనికోసం ఏటా అదనంగా ?11,000 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పెంపును అమలు చేసే అవకాశం ఉంది.

**మహాలక్ష్మి పథకం**

మహిళా సాధికారత లక్ష్యంగా ప్రతి అర్హులైన మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకంపై ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా సేకరించిన సమాచారం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. రేషన్ కార్డు ప్రాతిపదికన కుటుంబంలోని ఒక మహిళకు ఈ నగదు బదిలీ జరగనుంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతుండగా, ఈ నగదు సాయం కూడా తోడైతే మహిళలకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్ స్కీమ్:**

డిజిటల్ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించే కొత్త స్కీమ్‌ను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా ఉన్నత విద్య అభ్యసించే పేద విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు గ్లోబల్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందని విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

# మటన్ షాపుల్లో కనిపించని పరిశుభ్రత

**కరీంనగర్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మటన్ షాపుల నిర్వహణపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు, ఆహార భద్రతా ప్రమాణాలు అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.వేములవాడలో మటన్ షాపుల నిర్వ హణపై కఠిన చర్యలు తీసుకోవడం, పూర్తిస్థా యి కబేలా నిర్మాణాన్ని వేగవంతం చేయడం కాలానుగుణ అవసరంగా మారింది. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండానే కొంతమంది వ్యాపారులు మాంసం విక్రయం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో మటన్ షాపు నిర్వహించాలంటే సంబంధిత మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. కానీ కొందరు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకా ణం పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే లైసెన్స్ జారీ చేయాలి.అదనంగా, ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ తప్ప నిసరి. లైసెన్స్ నంబర్‌ను దుకాణంలో స్పష్టం గా ప్రదర్శించాలి. జంతువుల వధ అనుమతిప్రాప్తకబేలా (స్లాటర్ హౌస్)లో వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణలో జరగాల్సి ఉంటుంది. ధృవీకరించని మాంసం విక్రయం చేయడం చట్టవిరుద్ధం.మటన్ షాపులపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, లైసెన్స్ లేని దుకాణాల ను గుర్తించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం మున్సిపల్ అధికారుల బాధ్యత. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత కూడా వారి పైనే ఉంటుంది. అయితే పట్టణంలో పర్యవేక్షణ వ్యవస్థకు శ్రీకారం చుట్టి పూర్తి స్థాయిలో అమలు చేయాలనే అభిప్రా యం వ్యక్తమవుతోంది.పరిశుభ్రత లేని వాతావరణంలో విక్రయిం చే మాంసం వల్ల ఫుడ్ పాయిజనింగ్, టైఫాయి డ్, కలరా, జాండిస్ వంటి వ్యాధులు వ్యాపిం చే ప్రమాదం ఉంది. సాల్మొనెల్లా, ఈకోలై వం టి బాక్టీరియా ద్వారా పేగు సం బంధిత ఇన్ఫెక్షన్లు సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతారు.వేములవాడ పట్టణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బహుళ అవసరాల మార్కెట్ సముదాయం నిర్మాణానికి శ్రీకా రం చుట్టారు. ఇందులో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ విభాగాలతో పాటు కబేలా నిర్మా ణం కూడా ప్రతిపాదించారు. అయితే నిధుల లభ్యత లేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం నిర్మాణం అసం పూర్ణంగా ఉండటంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ పాలకవర్గం ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొర వ తీసుకొని స్లాటర్ హౌస్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నేడు కేటీఆర్ రాక..

# ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకున్న కేటీఆర్ పర్యటన

ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

**మంచిర్యాల :** ఆదిలాబాద్ జైలులో ఉన్న బాల్క సుమన్‌ను పరామర్శించేందుకు మంగళవారం కేటీఆర్ రానున్నారు. బాల్కసుమన్‌ను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న వార్తల నేపథ్యంలో కేటీఆర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకున్నది. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో సంఖ్యాబలం లేకున్నా పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ చేయని దౌర్జన్యాలు లేవు. పోలీసులు, అధికారుల అండదండలతో ఈ నెల 16వ తేదీ, 17వ తేదీల్లో క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక జరుగకుండా వాయిదా వేయించిన విషయం విదితమే. పక్కా పథకం ప్రకారం తొలిరోజు వాయిదా వేయించడం, రెండో రోజు బీఆర్ఎస్ నాయకులను అనుమతించకుండా, కాంగ్రెస్ నాయకులను అనుమతించడంపై ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ లీడర్లు రాళ్ల దాడి చేయడంతో బీఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు. ఈ క్రమంలో కేవలం బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. పైగా బాల్కసుమన్ సహా నాయకులు మూల రాజిరెడ్డి, అనిల్, రవికాంత్, తదితరులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి జైలుకు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టించిన నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్



తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా సర్కార్ వెనక్కి తగ్గడం లేదు. జైలులోనూ బాల్కసుమన్‌పై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు బాల్కసుమన్‌ను పరామర్శించనున్నారు. అనంతరం స్థానికంగా నిర్వహించే విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడనున్నారు.

**కస్టడీ, బెయిల్ ఫిటిషన్‌పై విచారణ వాయిదా..**

బాల్కసుమన్‌ను విచారించేందుకు నాలుగు రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ మంచిర్యాల జిల్లా కోర్టులో ఫిటిషన్ వేసిన విషయం విదితమే. కాగా, సోమవారం విచారణకు వచ్చిన ఈ ఫిటిషన్‌లో అసలు పోలీసులు పెట్టిన కేసుకు, కస్టడీకి ఇవ్వాలంటూ కోరిన అంశాలకు పొంతనే లేదంటూ బాల్కసుమన్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. దీంతో కస్టడీ ఫిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. కస్టడీ ఫిటిషన్‌కు ముందు బాల్కసుమన్ బెయిల్ పిటిషన్ విచారణకు రాగా, కౌంటర్ ఫిటిషన్ వేసేందుకు పోలీసులు సమయం కోరడంతో బెయిల్ ఫిటిషన్ సైతం నేటికి వాయిదా పడిందని న్యాయవాదులు తెలిపారు.

ఈ సందర్భంగా బాల్కసుమన్ న్యాయవాధులు మీడియాతో మాట్లాడారు. 'పోలీసులు ఫర్థర్ ఇన్వెస్టిగేషన్ కోసం కోరుతున్న అంశాలేవీ కేసు పెట్టినప్పుడు లేవు. వీరిదగ్గర ఏమైనా మారణాయుధాలు ఉన్నాయా... వీరి వెంట సమాజ వ్యతిరేక శక్తులు ఉన్నాయా.. ఇతర ప్రాంతాలు(హైదరాబాద్, వరంగల్) వారు ఉన్నారా.. వీళ్లను మానిటర్ చేసింది, వనరులు సమకూరుస్తున్నది ఎవరన్నది తెలుసుకోడానికి నాలుగు రోజులు పోలీస్ కస్టడీ కోరారు. పెట్టిన కేసుకు.. వేసిన కస్టడీ పిటిషన్‌కు సంబంధం లేదని బలమైన వాదనలు వినిపించాం. వందల సీసీ కెమెరాలు, వందల మీడియా కెమెరాలు ఉన్నాయి. మరణాయుధాలు ఎక్కడా కనిపించలేదు. బీఆర్ఎస్–కాంగ్రెస్ ఇరు వర్గాల మధ్య జరిగితే.. కేవలం ఒక పక్షం మీదే కేసు పెట్టడంపై సందేహాలు వ్యక్తం చేశాం. ప్రజాస్వామ్యంగా ఎన్ని

# కన్నీటి కష్టాలు తప్పవా?

**కరీంనగర్ కార్పొరేషన్:** వేసవి ప్రారంభంలోనే నగరంలో తాగునీటికి తిప్పలు మొదలయ్యాయి. సిటీలో ప్రతి రోజు తాగునీటి సరఫరా జరగాల్సి ఉండగా, ఇప్పటికే చాలా ప్రాంతాల్లో రోజు విడిచి రోజు సరఫరా జరుగుతోంది. తాగునీటి సరఫరాకు ఏకై క వనరైన ఎల్ఎండీలో క్రమేపీ నీటిమట్టం తగ్గుతుండడంతో, బుధవారం నుంచి నగరమంతా రోజు విడిచి రోజుకు నీటి సరఫరా మారనుంది. తాగునీటి ముప్పు ముంచుకువస్తుండడంతో, ఈ వేసవి గట్టెక్కడంపై బల్దియా అధికారులు కుస్తీపడుతున్నారు.

మిడ్‌మానేరు నుంచి 13 టీఎంసీలు వస్తేనే

తగ్గుతున్న ఎల్ఎండీ నీటిమట్టం నగరంలో తాగునీటి సరఫరాకు ప్రమాదఘంటికలను మోగిస్తోంది. ఫిబ్రవరిలోనే ఏడు టీఎంసీలకు పడిపోతే, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశముంది. మిడ్‌మానేరులో సరిపడా నీటి లభ్యత ఉన్నందున, ఎల్ఎండీకి ఇన్‌ఫ్లోను పెంచాల్సి ఉంది. మిడ్‌మానేరు నుంచి 13 టీఎంసీల నీళ్లు ఎల్ఎండీకి విడుదల చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఔట్‌ఫ్లోకు, ఇన్‌ఫ్లోకు 2500 క్యూసెక్కుల తేడా ఉండడంతో, ఈ తేడాను పూడ్చేందుకు అదనంగా 2,500 క్యూసెక్కులు మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీకి విడుదల చేయాల్సి ఉంది. అప్పుడు ఇన్‌ఫ్లో,



ఔట్‌ఫ్లో 4,500 క్యూసెక్కులుగా ఉండడంతో, ఇప్పుడున్న ప్రకారం 7 టీఎంసీల నీటి నిలువ తగ్గకుండా ఉంటుంది.

ముందస్తు ప్రణాళిక సిద్ధం

వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు రూ.49 లక్షలతో నగరపాలకసంస్థ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. వీటితో అవసరమైన చోట మరమ్మతులు చేయడం, విలీన ప్రాంతాల్లో బావులను అద్దెకు తీసుకొని,పైప్‌లైన్‌ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

7 టీఎంసీలకు నీటిమట్టం

నగరంలో తాగునీటి సరఫరాకు ఏకై న వనరైన ఎల్ఎండీ నీటిమట్టం క్రమేపీ తగ్గుతుండడం ఆందోళనకరంగా మారింది. సాధారణంగా ఎల్ఎండీలో 10 టీఎంసీల నీళ్లు నిలువ ఉంటే, నగరవ్యాప్తంగా ఆటంకం లేకుండా తాగునీటి సరఫరా జరుగుతుంది. వేసవి మొదట్లో అంటే ఫిబ్రవరి నెలలోనే నీటి మట్టం 7.7 టీఎంసీలకు పడిపోయింది. పైగా ఎల్ఎండీ ఔట్‌ఫ్లో 4,500 క్యూసెక్కులు ఉండగా, ఇన్‌ఫ్లో కేవలం 2,000 క్యూసెక్కులు ఉంది. దీంతో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ఎల్ఎండీ నీటిమట్టం 5 టీఎంసీలకు తగ్గితే, బూస్టర్‌లతో కూడా నీటిసరఫరాకు ఇబ్బంది ఏర్పడుతుంది. అప్పుడు అసాధారణంగా డ్యాం లోపలి నుంచి లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది.

నగరంలో తాగునీటి సరఫరా వివరాలు

వాటర్ ట్యాంక్‌లు 17(1000కేఎల్)

నిర్మాణంలో ఉన్న ట్యాంకులు: 07 (అమృత్ పథకంలో భాగంగా)

13 విలీన గ్రామాల్లో ట్యాంక్‌లు: 63 (1000 కేఎల్ సామర్థ్యం లోపు)

# మొబైల్ ఫోన్ల రికవరిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్న సిరిసిల్ల జిల్లా పోలీస్ యంత్రాంగం





**6 లక్షల విలువ గల 63 మొబైల్ ఫోన్లు రికవరీ...**

**మొబైల్ యజమానులకు అందజేత**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**రాజన్న సిరిసిల్ల :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో గత కొన్ని రోజుల నుండి పోయిన , చోరీకి గురైన సుమారు 6లక్షల రూ.విలువ గల 63 ఫోన్ల ఆచూకీ మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ చేసి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బుధవారం రోజు సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు అందజేయడం జరిగింది.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి,వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే,గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే అఇఎఖీ పోర్టల్ ( ష్ట్రబిబిజూబ://లిలిలి.ఇవతితీ.ఐనీల.తిని ) నందు బ్లాక్ చేసి, సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.× సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్ ,కానిస్టేబుల్ రాజాతిరుమలేష్ లను జిల్లా ఎస్పీ అభినందించారుపోయిన మొబైల్ ఫోను మళ్లీ దొరకదనుకున్న మొబైల్ ఫోన్ జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు జిల్లా ఎస్పీ కి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, ఆర్.ఐ యాదగిరి, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసాంఘిక కార్యకలాపాలను రూపుమపాలి ఎస్పీ అఖిల్ మహజన్



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలం మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్నందున ఆసాంఘిక కార్యకలాపాలు,అక్రమ రవాణా జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు.బుధవారం భీంపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పరిశీలించారు.పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా "అరైవ్ అలైవ్ 2.0" సందర్భంగా ప్రజలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాల నివారణ కృషి చేయాలని తెలిపారు. మండలంలో గంజాయి, గుడుంబా, దేశిదారు లాంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా ప్రజలకు ప్రోత్సహించాలని తెలిపారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ప్రజలు సన్మార్గం వైపు వెళ్లేలా ప్రయత్నించాలని తెలిపారు. ముఖ్యంగా లైసెన్స్ మేళ ద్వారా యువతకు డ్రైవింగ్ లైసెన్స్ త్వరగా అందే విధంగా చర్యలను చేపట్టాలన్నారు. సిబ్బందిని విడుదల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని విధులలో క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా ఉండాలని తెలిపారు..నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ఉండాలని, నేరం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోర్టుల నందు శిక్షలు పడే విధంగా చార్జి షీటును దాఖలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని వారి సమస్యలను త్వరితగతిగిన పరిష్కరించి న్యాయం చేసిన సందర్భంలో పోలీసుల పట్ల గౌరవం నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ జి శ్రావణ్, భీంపూర్ ఎస్ఐ బి విక్రమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మెర బాధితులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న కేటీఆర్

**మహబూబ్‌నగర్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో మరణించిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు.మల్లన్న జాతరలో కాంగ్రెస్ నాయకులు కుల వివక్ష చూపుతూ చాకలి చంద్రకళ కుటుంబంపై అమానుషంగా దాడికి దిగడంతో ,రెండు నెలల పాప తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులే దాడికి గురైన బాధిత కుటుంబంపైనే కేసు నమోదు చేయడంతో వారంతా భయపడి గ్రామం వదిలి నాగర్‌కర్నూల్‌లో తలదాచుకుంటున్నారు. ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరగకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి.కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడి పసిపాపను కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు ,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు మర్రి జనార్ధన్ రెడ్డి, అలా వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కుమ్మెర బాధితులకు సంఘీభావంగా దీక్షలో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవు వేసి నివాళి అర్పించారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 ఃఔూ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 94 పరీక్ష కేంద్రాల్లో (హన్మకొండ 52, వరంగల్ 24, జనగామ 16) తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.

1. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.
2. సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం.
3. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని సీపీ ఆదేశించారు.

ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని సీపీ హెచ్చరించారు.

## ఏళ్ల నిరీక్షణకు తెర

**కరీంనగర్ :** సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురునిచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకంలో నిర్మాణాలు ప్రా రంభించి నిలిచిపోయిన పనులకు ఇందిరమ్మ పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గడిచిన కొన్నేళ్లుగా మొండిగోడలు, పిల్లర్లతో దర్శనమి స్తున్న నిర్మాణాలు ఇక ఊపందుకోనున్నాయి. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక సాయం అందించేలా 2023లో అప్పటి ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ నిధుల విడుదలలో జాప్యం గుదిబండగా మారింది. అంతలోనే ప్రభుత్వం మారడంతో ఇక తమ పరిస్థితి ఏంటని లబ్ధిదారులు ఆందో ళన చెందారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. జిల్లాలో సదరు సమయంలో గృహలక్ష్మి పథకానికి 58వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. కరీంనగర్, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో భారీగా అర్జీలు రాగా ఆన్‌లైన్ చేశారు. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు నియోజకవర్గానికి 3వేల ఇళ్లను కేటాయించింది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సుమారు 45వేలకు పైగా మందిని ప్రాథమికంగా అర్హులని తేల్చారు. కొందరు లబ్ధిదారులకు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే మంజూరు పత్రాలు సైతం అందించారు. జిల్లాల్లో మూడు వేలకు పైగా అర్హులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించుకున్నారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారటం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లకు పథకానికి శ్రీకారం చుట్టడంతో గృహలక్ష్మి లబ్ధిదారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఉన్న ఇల్లు తొలగించుకుని, ఇందిరమ్మ పథకంలో లబ్ధి పొందక నానా ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తాజా నిర్ణయంతో భరోసా దక్కనుంది. గృహలక్ష్మి పథకంలో నిర్మాణం నిలిచిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com